# బ్యాంకింగ్ వ్యవస్థలో సంక్షోభం

**పంజాబ్** నేషనల్ బ్యాంకులో జరిగిన కుంభకోణం, మరియు అనేక ఇతర భారతీయ బ్యాంకులతోపాటు నీరవ్‌మోదీ కుంభకోణం వంటివన్నీ భారత బ్యాంకింగ్ రంగంలో సంక్షోభ అంశాన్ని మరోసారి ముందుకు తెచ్చాయి. ఇవన్నీ కొందరు దుష్టశక్తుల చర్యలు మాత్రమేనని వాదిస్తూ, దీనిని వ్యవస్థ వైఫల్యంగా పేర్కొనరాదంటున్నారు. దీనికి పరిష్కారంగా ప్రైవేటీకరణను ప్రభుత్వం ముందుకు నెడుతోంది. ప్రారంభం నుండి ఈ అంశాన్ని పరిశీలిద్దాం.

1809లో 'బ్యాంక్ ఆఫ్ బెంగాల్'ను స్థాపించడం ద్వారా వ్యాపార బ్యాంకింగ్ వ్యవస్థ ప్రారంభమైంది. ఆతర్వాత 1840లో 'బ్యాంక్ ఆఫ్ బాంబే', 1843లో 'బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర' ప్రారంభించబడ్డాయి. ఈ మూడు బ్యాంకులు కలగలసి తదనంతరం 'ఇంపీరియల్ బ్యాంక్'గా ఏర్పడ్డాయి. ఆపై ఇంపీరియల్ బ్యాంక్ జాతీయం చేయబడి, తన పేరును 1955లో "స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా"గా మార్చుకుంది. బ్యాంకింగ్ వ్యవస్థ నియంత్రణకు, కేంద్ర కరెన్సీ కోసం 1935లో "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా"ను ఏర్పరచారు. ఈ విధంగా మొదట బ్యాంకు ప్రారంభమైన తర్వాత ప్రైవేటు పెట్టుబడిదారులు పలు ప్రైవేటు బ్యాంకులను స్థాపించారు.

1947-55 మధ్యకాలంలో 361 ప్రైవేటు బ్యాంకులు విఫలమయ్యాయి. ఈ బ్యాంకులలో ప్రజలు దాచుకున్న డబ్బంతా తిరిగి రాలేదు. 1960ల నాటికి బడా బూర్జువా వర్గపు యాజమాన్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు పలు ప్రైవేటు బ్యాంకులు వున్నాయి. ఈ బ్యాంకులలో ప్రధానంగా మెట్రో నగరాలలో గృహ సంబంధ పొదుపులో అతికొద్దిభాగం మాత్రమే నిల్వ చేసుకొనేవారు. దాదాపు మొత్తంగా పారిశ్రామిక సంస్థలకు బ్యాంకులు ఈ మొత్తాలను రుణాలుగా అందజేసేవి. 1967 నాటికి బ్యాంకులు మొత్తంగా ఇచ్చే రుణంలో వ్యవసాయరంగ వాటా కేవలం 2 శాతానికి కొంచెం హెచ్చుగా వుండేది.

గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని గృహ సంబంధ పొదుపు మొత్తాలను రాబట్టుకోవటానికి వాణిజ్య బ్యాంకులు ఉండాల్సిన అవసరాన్ని, ఈ పొదుపు నిధుల మొత్తాన్ని తమ పెట్టుబడుల అవసరాలకు వినియోగించుకోవచ్చునని భారత పాలకవర్గాలు గుర్తించాయి. గ్రామీణ లేదా పట్టణ ప్రాంతాలకు తమ కార్యకలాపాలను విస్తరించటానికి ఆనాడు ప్రైవేటు బ్యాంకులకు ఆసక్తిగానీ, సామర్థ్యం కానీ లేకపోయాయి. నూతన ఆర్థిక విధానాల తదనంతరం ఈనాటికి కూడా గ్రామీణ ప్రాంతాలలో నిర్వహణకు అనుమతించిన ప్రైవేటు బ్యాంకుల కార్యకలాపాలు అత్యంత తక్కువగా వున్నాయి. పైగా, 1960లో అమలులోకి వచ్చిన పైరుపచ్చ విప్లవ వ్యూహంతో వ్యవసాయ రంగంలో రసాయన ఎరువులు ఇతర ఉత్పాదకాలకు మార్కెట్లను సమకూర్చటం కోసం రుణ విస్తరణ చేయవలసి వచ్చింది. ఈ విధంగా భారత ప్రభుత్వం 1969లో 14 బ్యాంకులను, 1980లో మరో ఆరు బ్యాంకులను జాతీయం చేసింది.

బ్యాంకుల జాతీయీకరణను సామ్యవాద తరహా చర్యగా నాటి ప్రధాని ఇందిరాగాంధి అభివర్ణించింది. దీని ఫలితంగా ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడివున్న చిన్న పరిశ్రమలకు, రైతులకు చౌకగా బ్యాంకురుణం అందజేయ బడుతుందని చెప్పారు. అయితే ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడటమనే దాంట్లో ఈనాటికీ మార్పు లేదు.

ఏమైనా, బ్యాంకుల జాతీయీకరణ ఫలితం ఊహించినదే. మధ్యతరగతి వర్గాలు ప్రభుత్వం వద్ద తమ సొమ్ము భద్రంగా వుంటుందనే ఆశతో తాము కష్టించి సంపాదించిన డబ్బునంతా జాతీయ బ్యాంకులలో నిల్వచేస్తే భారత బడా బూర్జువా వర్గం ఈ పొదుపు మొత్తాలన్నింటిపై అదుపు సాధించ గలిగింది. ఈ పొదుపు మొత్తాలన్నీ పారిశ్రామిక, వాణిజ్య రంగాలలోనే కాక జూదతరహా వ్యాపారాలలో (ఐపిఎల్ క్రికెట్ పోటీలలో డెక్కన్ క్రానికల్ మదుపు చేసిన కేసులోవలె) బడా బూర్జువావర్గం పెట్టుబడిగా వినియోగిస్తోంది.

ప్రభుత్వ రంగ బ్యాంకులు తాము కేటాయించుకునే మొత్తం రుణాలలో 18 శాతాన్ని ప్రాధాన్యతారంగాలకు ఇవ్వాలనే ప్రభుత్వాదేశాలు వచ్చేంతవరకు, ప్రభుత్వరంగ బ్యాంకులు వ్యవసాయ రంగంవైపే చూడలేదు.

జాతీయీకరణ తర్వాత, బ్యాంకింగ్ రంగం అసాధారణంగా విస్తరించటం, తదనుగుణంగా చట్టబద్ధంగాను, అక్రమంగా బ్యాంకులో నిల్వలను బడా పెట్టుబడిదారులు కైంకర్యం చేయటంకూడా అసాధారణంగా పెరిగిపోయింది. బడా బూర్జువా వర్గానికి చేతినిండా డబ్బు సమకూరింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల డైరెక్టర్ల బోర్డులలో బడా బూర్జువా వర్గ ప్రతినిధులు వుంటారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క నిర్ణాయక బోర్డులోనూ వారు తగిన స్థానం కలిగివుంటారు. స్వతంత్ర డైరెక్టర్లుగా చెప్పబడేవారంతా బడా బూర్జువా వర్గపు ప్రతినిధులే. ప్రభుత్వరంగ బ్యాంకుల కార్యకలాపాల నిర్వహణను పర్యవేక్షించే ఉన్నతస్థాయి అధికారులకు కావలసిన లబ్ధి చేకూర్చి బడా బూర్జువావర్గం వారిని లోబరచుకుంటుంది. ఈ విధంగా ప్రజాధనం తరలి పోవటానికి ఒక మార్గం ఏర్పడుతుంది. బడా బూర్జువావర్గం ఏదో ఒక కారణంతో తాము తీసుకున్న రుణాలను చెల్లించటానికి నిరాకరిస్తే, వారందరికీ ఇచ్చిన అప్పును నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఏ)గా పరిగణించి, తదనంతర కాలంలో ఆ అప్పును రద్దు చేయటమో లేదా బ్యాంకులకు పునఃపెట్టుబడి కల్పించే పేరుతో ప్రభుత్వమే వారికి బడ్జెట్ వనరులనుండే నిధులను సమకూర్చటమో చేస్తోంది. 1980లమధ్య కాలంలో, ప్రభుత్వరంగ బ్యాంకుల ఎన్‌పిఏలు పదిలక్షల కోట్ల రూ॥ల పై కెగబ్రాకాయి. ఇవన్నీ ప్రధానంగా బడా పెట్టుబడిదారులు రుణాలు తిరిగి చెల్లించకపోయిన కారణంగానే ఏర్పడ్డాయి. రుణ ఎగవేతదారులుగా చెప్పబడుతున్నవారి పేర్లను

బ్యాంకు ఉద్యోగుల సంఘాలు విడుదల చేశాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులకు 'పునః పెట్టుబడి' పేరిట బడ్జెట్ నిధులను సమకూర్చుతోంది మినహా ప్రభుత్వం అప్పు ఎగవేసిన వీరిపై ఎలాంటి చర్యా తీసుకోలేదు.

గత 5 సంవత్సరాలుగా ప్రభుత్వరంగ బ్యాంకుల ఎన్‌పిఏల తాజా సమస్య బాగా వెలుగులోకి వస్తోంది. యుపిఏ-2 ప్రభుత్వ ఆర్థిక శాఖామంత్రి చిదంబరం, ఎన్‌డిఏ-2 ప్రభుత్వ ఆర్థిక శాఖామంత్రి అరుణ్ జైట్లీలు- దాదాపు 30 కుటుంబాలు రుణాలు చెల్లించని కారణంగా ఎన్‌పిఏలు ఏర్పడ్డాయని ప్రకటించారు. రుణాలు చెల్లించనివారినుండి తిరిగి రాబట్టటానికి ఏ చర్యలూ తీసుకోకపోగా, వారి పేర్లను బహిరంగ పరచటానికి కూడా ప్రభుత్వాలు నిరాకరిస్తున్నాయి.

ప్రభుత్వరంగ బ్యాంకుల ఎన్‌పిఏల సంఖ్య అప్పు మొత్తం ప్రతి ఏటా పెరుగుతోంది. 2015 మార్చినాటికి 2,67,000 కోట్ల నుండి 2017 జూన్ 30 నాటికి 6,89,000 కోట్లకు ఎన్‌పిఏలు పెరిగినట్లు 2018 ఏప్రిల్ 6న లోక్‌సభలో ఆర్థికశాఖ సహాయమంత్రి శివప్రసాద్ శుక్లా ఓ ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు. 21 ప్రభుత్వరంగ బ్యాంకులలో 11 బ్యాంకులు తమ మొత్తం ఆస్తుల కంటె 15 శాతం అధికంగా ఎన్‌పిఏలను కలిగి వున్నాయి. 2017 డిసెంబర్ చివరనాటికి ఎన్‌పిఏలు మరింతగా పెరిగి 7,89,000 కోట్ల రూ॥లకు చేరుకున్నాయి. ప్రైవేటు బ్యాంకుల ఎన్‌పిఏలు 2014జూన్ నాఇకి 2,41,110 కోట్ల రూ॥ కాగా, 2017 డిసెంబర్ నాటికి 9,89,330 కోట్ల రూ॥లకు పెరిగాయి. మొత్తం ఎన్‌పిఏల విలువ 8,82,000 కోట్ల రూ॥లుగా వుంది. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం రద్దుచేసిన దాదాపు 4 లక్షల కోట్ల రూ॥ తర్వాత మిగిలిన ఎన్‌పిఏల మొత్తంగా దీనిని గుర్తించారు.

21 ప్రభుత్వరంగ బ్యాంకులలో 19 బ్యాంకులు 2017-18 నాటికి నష్టాలలో కూరుకు పోయి, ప్రభుత్వం అందించిన 13 వందల కోట్ల రూ॥ పెట్టుబడి దాదాపు తుడిచిపెట్టుకు పోయిందని బిజినెస్ స్టాండర్డ్‌లోని ఓ వార్త (1-6-18) పేర్కొంది. ఎన్‌పిఏలు భారీగా పెరిగిపోవటమే ఈ నష్టాలకు కారణమని ఈ వార్త విశ్లేషించింది.

రిజర్వ్‌బ్యాంకు వెలువరించిన మొదటి ఎన్‌పిఏ జాబితాలో 12 కేసులు వున్నాయి. వీరిని ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్టసీ కోడ్ (ఐబిసి) (దివాళా తీసినవారుగా) క్రింద వ్యవహరించారు. ఈ జాబితాలో-మోనెట్ ఇస్పాత్ అండ్ ఎనర్జీ; ఎలక్ట్రో స్టీల్ స్టీల్స్, అలోక్ ఇండస్ట్రీస్, జ్యోతి స్ట్రక్చర్స్, భూషాన్ స్టీల్స్, భూషాన్ పవర్ అండ్ స్టీల్; ఎస్సార్ స్టీల్, జెపి ఇన్‌ఫ్రాటెక్; ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్, ఎబిజి షిప్‌యార్డ్; ఎమ్‌టెక్ ఆటో; మరియు ఇ. వి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్- ఉన్నాయి.

ల్యాంకో కేసు చూద్దాం. ఇది కొండపల్లిలో మొదటి యూనిట్ విద్యుత్తు కర్మాగారాన్ని (నాఫ్తా మరియు సహజవాయువులతో) ద్వంద ఇంధన సాంకేతికతో నిర్మించింది. గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (గెయిల్) ల్యాంకోయొక్క కొండపల్లి మొదటి యూనిట్‌కు సహజ వాయువు సరఫరా చేయటానికి నిరాకరించింది. గెయిల్‌కు మిగులు సహజ వాయువు లేకున్నప్పటికీ భవిష్యత్తులో ల్యాంకోకు సహజవాయువు సరఫరా చేస్తామని అంగీకరించింది. మొదటి యూనిట్ ఇన్ని సంవత్సరాలుగా నాఫ్తాపైనే నడుస్తోంది. ఇదంతా తెలిసికూడా అదే స్థలంలో మరో మూడు యూనిట్లకు బ్యాంకులు రుణాలందజేశాయి. వాటినిర్మాణం పూర్తయిన తర్వాత కూడా అవి ఉత్పత్తి లేకుండా 5 సం॥లపైగా ఖాళీగా వున్నాయి. ఎన్‌రాన్ ప్రాజెక్టు కేసులోవలె ప్రైవేటు విద్యుదుత్పత్తి పరిశ్రమలు వాస్తవ నిర్మాణ ఖర్చుకు రెట్టింపు ఖర్చును చూపటంద్వారా తాము ఉత్పత్తి చేసిన విద్యుత్తుకు అధిక చార్జీలు వసూలు చేస్తాయి. ల్యాంకో విద్యుత్ యూనిట్ విషయం కూడా అదే జరిగింది. ఇవన్నీ నమోదైవున్న వాస్తవాలు. అప్పులిచ్చే బ్యాంకులు ఇతర మార్గం చూడటంతో అదనపు నిధులు సమకూరుతున్నాయి.

ఆర్‌బిఐ ఇచ్చిన జాబితాలో నాలుగు ఉక్కు పరిశ్రమలున్నాయి. భూషాన్ స్టీల్స్‌కు అధికధర చెల్లించి కొనుగోలు చేయటానికి టాటా కంపెనీ పోటీ పడింది. అది ఆమోదం పొందితే రుణం అందించిన బ్యాంకు 23వేల కోట్ల మేరకు రుణాన్ని రద్దుచేసుకోవలసి వస్తుంది. ప్రభుత్వరంగ బ్యాంకులు రుణాన్ని రద్దుచేస్తే టాటా కంపెనీ, భూషాన్ స్టీల్ ఫ్యాక్టరీని చౌకగా పొందుతుంది. ఈ సంక్షోభం మరింత పారిశ్రామిక గుత్తాధిపత్యానికి దారి తీస్తుంది. ఇప్పటికే ఎస్సార్‌స్టీల్స్‌ను జెఎస్‌డబ్ల్యు కొనుగోలు చేసే క్రమంలో ఉంది.

ఈ విధంగా బడా బూర్జువావర్గం ప్రభుత్వ రంగ బ్యాంకులను కొల్లగొడుతోంది, ఖజానాను దోచుకుంటోంది. ఈ కారణంగానే భారత బడా బూర్జువా వర్గాన్ని దళారీ స్వభావంతోపాటు నిరంకుశాధికార పెట్టుబడిదారీ వర్గ స్వభావం కలిగివుందని సిపిఐ (ఎంఎల్) సూత్రీకరించింది.

బ్యాంకింగ్ రంగంలోని సమస్యలన్నింటికీ ప్రైవేటీకరణే మార్గాంతరమని ప్రబోధిస్తున్నారు. ఇంతకుముందే ప్రస్తావించిన విధంగా అనేక ప్రైవేటుబ్యాంకుల వద్ద ఎన్‌పిఏలు పోగుబడి ఆ బ్యాంకులు విఫలమయ్యాయి. కొన్ని సంవత్సరాల క్రింతం గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు వైఫల్యం దీనిని స్పష్టంగా ఎత్తి చూపుతోంది. 2008లో అత్యధిక ప్రైవేటు బ్యాంకులు ఎన్‌పిఏలలో కూరుకుపోయాయి. దీనికి తాజా ఉదాహరణ యాక్సిస్ బ్యాంక్. తాజా త్రైమాసికంలో అది 2,188 కోట్ల నష్టాన్ని చవి చూసినట్లుగా పేర్కొంది. పురాతనమైన, అతిపెద్ద ప్రైవేటు బ్యాంకు ఐసిఐసిఐ కుంభకోణపు ఆరోపణలు ఎదుర్కొంటూ, ఆ బ్యాంకు సిఇఓనే ఆ పదవినుండి తొలగించవలసి వచ్చింది.

ప్రైవేటీకరణ అంటేనే అందమైన మాటలలో భారతీయ బ్యాంకులను విదేశీ ద్రవ్య గుత్త పెట్టుబడికి అప్పగించటమేనని అందరికీ తెలుసు. గత దశాబ్ద కాలంగా దేశీయ బ్యాంకులను విదేశీ ద్రవ్యపెట్టుబడికి కట్టబెట్టేందుకనుగుణంగా వరుసగా అనేక పాలనా సంబంధమైన, చట్టపరమైన చర్యలను చేపడుతూ, బాటవేస్తూ వస్తున్నారు. దివాళా చట్టం, ఎఫ్ఆర్‌డిఐ చట్టం, జాతీయ

కంపెనీ చట్ట న్యాయస్థానం వంటివానిలో చేబట్టిన చర్యలు దీనికి తార్కాణం. భారతదేశంలో బ్యాంకులను, ఇతర ద్రవ్య సంస్థలను విదేశీ ద్రవ్యపెట్టుబడి తన స్వాధీనంలోకి తెచ్చుకోవటానికి ఈ సంస్కరణలుగా చెప్పబడేవి మరింత సులభతరం చేస్తున్నాయి.

మరోవైపు ఈ చర్యలు ఎన్‌పిఏ భారాలకు కారణమైన భారత బడా బూర్జువా వర్గానికి ఉపకరిస్తాయి. ఐబిసి క్రిందకు 75 శాతం బ్యాంకులు బలవంతంగా వెళ్ళవలసి వస్తుంది.

ఈ క్రమంలో రైతాంగం, చిన్నవ్యాపారులు, చిన్న పరిశ్రమదారులు ఎన్‌పిఏల పేరుతో వేధింపులకు గురవుతున్నారు. రద్దుచేయబడుతున్న బాకీల భారం, బ్యాంకులకు తిరిగి అందించే పెట్టుబడి భారమంతా, ఇప్పటికే పూట గడవడం కష్టంగా బతుకుతున్న ప్రజల మూపులపై మోపబడుతోంది. వినాశకరమైన పెద్దనోట్లరద్దు, జిఎస్‌టిల దెబ్బలకే ఆర్థిక వ్యవస్థ ఇంకా కోలు కోలేదు; కోలుకుంటుందనే ఆశాలేదు. బ్యాంకులకు తిరిగి పెట్టుబడినందించటం పరిస్థితిని మరింతగా దిగజారుస్తుంది.

**అతిపెద్ద 5 బ్యాంకులమొత్తం ఎన్‌పిఏలు**

| ప్రభుత్వరంగ బ్యాంకు | *మొత్తం ఎన్‌పిఏ (బిలియన్ రూ॥లలో)* | |
|---|---|---|
| | జూన్ 2014 | జూన్ 2017 |
| ఐడిబిఐ బ్యాంక్ | 107.64 | 332.67 |
| యూకోబ్యాంక్ | 63.46 | 253.32 |
| యునైటెడ్‌బ్యాంక్ | 70.97 | 137.21 |
| దేనాబ్యాంక్ | 31.69 | 141.69 |

oooo